సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 ఫిబ్రవరి, 2011 సంచిక : 9

(వికృతి నామ సం॥, ఫాల్గుణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు

(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | రూ॥ | 6/- |
| వార్షిక చందా | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

Ph : 08685-326053

9440413455, 9848133565

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి ..... 2
అమ్మ చెప్పిన మాట ..... 5
దేవుళ్లు-దెయ్యాలు ..... 10
గురుసేవ ..... 12
శ్రీమద్భగవద్గీత-ప్రయోజనం ..... 15
బాలవాణి ..... 16
మాతృసందేశం ..... 18
లేఖావాణి ..... 20
ఆదిగురువు-దత్తప్రభువు ..... 21
స్వరాంజలి (సాయి మార్గం) ..... 24
దానం ..... 25
మా ఆశ్రమము ..... 27
సచ్చిదానంద వాణి ..... 28
శ్రీ సాయి పాత్ర:స్మరణం ..... 29
ఒక ఉపాధ్యాయిని జవాబు ..... 30
మానససుధ ..... 31







## మా వాణి

సాయివాణి పాఠకలోకానికి నమస్కారం,

శ్రీ సాయినాథుల వారు భక్తుల హృదయాల లోపలే నివసిస్తారని మనకందరికీ తెలుసు. పిలిస్తే పలుకుతారనీ తెలుసు. కానీ, యిది అవసరమైనపుడు మాత్రమే గుర్తు వస్తుంది. నిత్యజీవితంలో క్షణక్షణం గుర్తుంచుకోవలసిన విషయం ఎప్పడో ఒకసారి గుర్తు రావటం ఎందువలన? కాలికి ఎదురుదెబ్బ తగిలినపుడు మాత్రమే 'అమ్మా' అని కేక పెట్టే బుద్ధి మనది. అంచేత యిలా జరుగుతుంటుంది. అలాకాక అప్రయత్నంగా అలవోకగా 'సాయీ' అనగలగాలంటే ఎలాగ? నిరంతరస్మృతి ఉండాలంటే రోజులో కొంతభాగమైనా ఆయనతో గడపటం నేర్చుకోవాలి. తీరికలేని జీవితాలు, ఉరకల పరుగుల ఉద్యోగాలు, నిరంతరం ఏదో ఒక ఒత్తిడికి గురియై ఉండే మనసులు, సంసార దు:ఖాలు, మత్తెక్కించే సుఖాలు - వీటన్నిటి మధ్య సాయిని పూజించటానికి అవకాశం దొరకటం లేదు - అని కొందరు వాపోతూ ఉంటారు. నిరంతర పేదరికం వలన కూడా మేము సాయిని సేవించుకోలేకపోతున్నాం అంటారింకొందరు. సాయిని పూజించడానికి ధూపాలు, దీపాలు, నైవేద్యాలు అవసరం లేదు. పూలూ, పళ్లూ, అలంకారాలు, గుడులకు వెళ్లటాలు కూడా అక్కరలేదు. ఇవన్నీ మన ఆనందం కోసం, సంతృప్తికోసం మనం చేసుకునేవి మాత్రమే. "అష్టాంగయోగంతోగానీ, పూజాతంతుతోగానీ నాకు పని లేదు. భక్తితోనే నాకు సంతృప్తి" అని ఆయనే స్వయంగా చెప్పారనడానికి సచ్చరిత్రే ఆధారం.

ఏ విధంగానూ ధనాన్నీ, సమయాన్నీ ఎక్కువగా వెచ్చించలేని వారుండవచ్చు. గుడులూ, గోపురాలూ దగ్గరలో లేకపోవచ్చు. పూజాతంతు వంటివి రాకపోవచ్చు. అలాంటి వారికి అత్యద్భుతమైన వరం మానసిక పూజ. నిజానికి చేత్తో, వస్తువులతో పూజ చేసేటపుడు కన్ను ప్రక్కకు తిరగటమో, ఎవరో ముఖ్యమైన వ్యక్తులు వస్తే మధ్యలో పూజ ఆపవలసి రావటమో జరగవచ్చు. కానీ, మానసిక పూజలో నీ సర్వావయవాలూ నిశ్చలంగా కేంద్రీకరించే

అవకాశం ఎక్కువ.

శ్రీ సాయినాథుల వారు మన ఎదురుగా ఉన్నారనుకొని సుస్థిరంగా కూర్చోవాలి. స్వామికి ఏమేమి సేవలు చేయదలచుకుంటామో అవన్నీ మనసుతో అనుకొంటూ చేత్తో చేస్తున్నట్లు భావిస్తూ ఉండాలి. ఇంటికి ఎవరైనా ఆప్తబంధువు వస్తే ఎదురువెడతాం. నమస్కరిస్తాం. కాళ్లు కడుక్కోవడానికి నీళ్లిస్తాం. తాగడానికి నీళ్లిచ్చి మర్యాద చేస్తాం. మర్యాదగా పలకరించి కబుర్లు చెప్తాం. స్నానానికీ, భోజనానికీ, తాంబూలానికీ ఏర్పాట్లు చేస్తాం. పూజంటే యిదే. హారతి వాతావరణ శుద్ధి కోసం. నా హృదయం, ఆలోచనలు యీ కర్పూరంలాగా వెలిగి మాయమైపోవాలి. కేవలం ఆ పరిమళమే మిగలాలి. నా జీవితం నీ సేవలో యిలాగే కరిగిపోవాలి - అనే భావనను ఇది సూచిస్తుంది.

మనం బాబా ముందు కూర్చొని మనస్సుతోనే ఆహ్వానిస్తున్నట్లు, నీళ్లు ఇస్తున్నట్లు, స్నానం చేయిస్తున్నట్లు, భోజనం తినిపిస్తున్నట్లు - యిలా రకరకాలుగా భావించుకోవాలి. హారతిచ్చినట్లు, ఆత్మప్రదక్షిణలు చేస్తున్నట్లు అనుకొన్న తరువాత - మనం ఆయనతో చేసుకోగల విన్నపాలన్నీ నిర్భయంగా చేసుకోవాలి. ఇదే మానసిక పూజ. "ఏమీ చెయ్యకుండానే చేసినట్లుగా భావించటం నటన గదా! దాని వలన ముక్తి ఎలా కలుగుతుంది? పోనీ, శక్తి ఎలా పెరుగుతుంది?" అని ఒక ప్రశ్న ఉదయిస్తుంది సహజంగా. దానికి జవాబే శ్రీశ్రీశ్రీ పరమహంస సచ్చిదానందమూర్తి గారి జీవితం.

ఆయన పూర్వాశ్రమ నామం ఏమిటో తెలియదు. కడపజిల్లా గడికోటలో వారి ఆశ్రమం ఉంది. బట్టల మూట మోసుకొంటూ ఇంటింటికీ వెళ్లి బట్టలమ్ముకొని ఉదరపోషణ చేసుకోవలసిన స్థితి. భగవంతుడి మీద ఎంత ప్రేమ, భక్తి ఉన్నాగానీ పూజాదికాలు చేయగల శక్తి లేదు. అందుచేత ఆయన మానసిక పూజను ఆశ్రయించారు. స్థిరంగా ఓచోట కూర్చొని ఇటుకలు, రాళ్లు మొయ్యటంతో మొదలుపెట్టేవారు. చిన్న గర్భగుడి, దాని ముందు మంటపం చుట్టూ ప్రాకారం కట్టేవారు. స్వామి విగ్రహం, ద్వార పాలకుల బొమ్మలు నిలిపేవారు. తోరణాలు కట్టి, అలంకారాలు చేసి పూజ ప్రారంభించేవారు. అభిషేకం చేసి, మెత్తని బట్టతో ఒళ్లు తుడిచి, వస్త్రాలు వేసి, కుంకుమ గంధం దిద్ది, పూలమాల వేసేవారు. దీపారాధన, ధూపం, గంధ ధారణ వగైరాలన్నీ శాస్త్రోక్తంగా చేసేవారు. ఆవాహనం, ఆసనం ఏదీ వదిలేవారు





కారు. పూజ మొత్తం పూర్తయ్యేటప్పటికి - స్వామికి ఆరగింపు, పవళింపు సేవలతో సహా - రెండుగంటలు పట్టేది. ఆయన కర్మయోగి. తమ పనిపాటలన్నీ మామూలుగా చేసుకుంటూనే ప్రతిరోజూ మానసిక పూజ క్రమం తప్పకుండా చేస్తూ ఉంటే - పన్నెండేళ్లు అలా గడిచిపోయాయి. ఆయనకు ఏ దివ్య సాక్షాత్కారం కలిగిందో - గొప్ప వైరాగ్యం ఆవరించింది. అంతే-పరమహంస సచ్చిదానందమూర్తిగా అవతరించారు. తమ సాధనను, అనుభవజ్ఞానాన్ని సంతరించుకొని వారు రచించిన "జీవ బ్రహ్మైక్య వేదాంత రహస్యం" అనే గ్రంథం రాజయోగసారమని ప్రసిద్ధి చెందింది. గొప్ప పండితుడేమీ కాని సచ్చిదానంద మూర్తి వారు కబీరు చరిత్ర మొదలైన గ్రంథాలను రసరమ్యంగా ద్రవిడభాషలోకి అనువదించారు. ఎందరెందరో శిష్యులను రాజయోగులుగా తయారుచేయగలిగారు. అదీ మానసిక పూజ శక్తి! వీరి జీవితం వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా "సోహం" (తానే నేను) మంత్రం ద్వారా మానసికంగా భగవానుడే తానని భావిస్తూ ధన్యులైన వారెందరో!

అందుచేత మిత్రులారా, 'ఈ ఒత్తిళ్ల బ్రతుకులో దైవచింతన కుదరటం లేదే' అని విచారించనక్కర్లేదు మనం. పిల్లల తలలు దువ్వి జడలు వేస్తూ, బియ్యంలో రాళ్లు (పోనీ వైస్ వెర్సా) ఏరుతూ, ఇళ్లు ఊడుస్తూ, ఆఫీసులకు వెళ్లేందుకు బస్సులెక్కి, బస్సుల కోసం ఎదురుచూస్తూ .... ఎన్నెన్ని అవకాశాలు సాయి నామం చెప్పకొనేందుకు! ఇది బాగా అభ్యాసం చేస్తూ వెడితే కొంతకాలానికి అప్రయత్నంగానే మనం ఏ పని చేస్తున్నా అంతర్లీనంగా సాయిస్మృతి నడుస్తూనే ఉండటం జరుగుతుంది. అలా ప్రయత్నిద్దాం. తీరిక దొరికినప్పుడల్లా మానసిక పూజ చేసుకుంటూ ఆ ఆనందాన్ని అనుభవిద్దాం.

మరొక్కమాట. సామూహిక ప్రార్థన, స్తుతి, జపం - వీటికి శక్తి శతసహస్ర గుణాలుగా పెరుగుతుంటుందని శాస్త్రం చెప్తుంది. అందుచేత సాయిభక్తులైన వారు ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో - పడుకొనే ముందైనా, భోజనానికి ముందైనా సరే - ఇంట్లోని వారంతా - మూడేళ్లు నిండిన పిల్లలతో సహా ఒకచోట కూర్చొని కొద్దిసేపు నామం పలకటం, ఓ చిన్న భజన చెయ్యటం, కొంత ధ్యానం - యిలా చేస్తే ఇంటికీ మనకూ కూడా ఒక పవిత్రత వస్తుంది. పిల్లలెందుకూ? అనుకోకండి. ఆ సంస్కారం పసితనం నుండే రావాలి, మనం తేవాలి. మన క్రైస్తవ మిత్రులను ఈ విషయంలో ఆదర్శంగా తీసుకోవాలి. నేటి నుండే యీ సామూహిక చింతన ప్రారంభిద్దాం.

# అమ్మ చెప్పిన మాట-స్త్రీ

**- సుమలత**

మా అమ్మ అంటే ఒక్క అమ్మ కాదు. భారతాంబ ఒడిలో ఎదిగిన అమ్మలం దరికీ ప్రతీక. ఈనాటి అమ్మలకూ, నాటి అమ్మలకూ కొంత భేదం ఉంది. వికసించే వ్యక్తిత్వాలను పెంచుకోవాలన్న తపనతో స్త్రీలు, కూలిపోతున్న సామ్రాజ్యాలను నిలుపుకోవాలన్న దుగ్ధతో పురుషులు-పరస్పర వైరుధ్యాలతో రగులుతూ ఒకే కప్పు క్రింద పిల్లల కోసమో, పరువు కోసమో, అంతరాంతరాలలో దాగి ఉన్న ప్రేమ వదిలి పోక పోవటంచేతనో కలసి బ్రతుకుతున్నారు. అనాది కాలంగా ప్రపంచాన్ని ధర్మం పరిపాలిస్తూ వచ్చింది - ఓ నూరేళ్ల క్రిందటి వరకు. ఒక శతాబ్ది కాలం నుండీ మారుతూ మారుతూ వచ్చి ప్రస్తుతం రూపాయే తిరుగులేని పరిపాలన చేస్తున్నదన్న విషయం అందరం ఒప్పకొని తీరవలసిన సంగతే. తనతోపాటు ఆర్జిస్తుండటమే గాదు - తన పుట్టినింటినుంచీ ఆస్తిపాస్తులతో వచ్చిన భార్య తనకూ, తన వారికీ అడుగులకు మడుగులొత్తుతూ ఉండాలనీ, ఉంటుందనీ ఆశించటం పురుషుడి దురాశ. ఆర్జనలో ముందున్నంత మాత్రాన తన స్థాయి పురుషుడితో సమంగా ఉండాలని కోరుకోవటం, ఉండి తీరుతుందని ఆశించటం ఆడపిల్ల దురాశ. దురాశ అని ఎందు కంటున్నామంటే - ఏదైనా ఒక కొత్త మార్పు వచ్చి, అది దృఢంగా నిలవాలంటే ఏడు తరాల సమయం పడుతుందని ధర్మశాస్త్రమూ చెప్తుంది - జీవశాస్త్రమూ చెప్తుంది. ఆ లెక్క ప్రకారం మరో రెండు తరాల టైముంది పూర్తి మార్పుకు. ఈ లోపలే తొందరపడి లాభం లేదుగా మరి! పోనీ వాడితో సమానమని తాననుకొంటే అన్నివిధాలా అలాగే ఉండాలి. ఉండగలదా? లేదు. కొంత లాలిత్యాన్నీ, మాధుర్యాన్నీ ఉద్యోగ జీవితాల్లో పోగొట్టుకొంటున్నాగానీ యింకా భర్త దగ్గర లాలననీ, ఆర్ద్రతనీ కోరుకోకుండా కేవలం యాంత్రికంగా జీవించే దశకు రాలేదు భారతీయ మహిళలు. "అందరినీ వదిలి నా కోసం వచ్చిన యిల్లాలిని గౌరవపూర్వకంగా ప్రేమించాలన్న సత్సాంప్రదాయాన్ని మర్చి పోయాడు పురుషుడు. "అమ్మాయి మాలో కలిసిపోవాలి" అని ఆశించే అత్తగారి తరపు





వారు "ఆమె పెరిగిన వాతావరణం వేరు. కనుక ఆమె అలవాటుపడే వరకు కొంత ఓర్పుగా ఉండి, నేర్పుగా మనలో కలుపుకోవాలి" అనుకోగలగాలి. చిన్న (మైక్రో) సంసారాలు ఎక్కువయ్యాక యీ అనుకూల్యం కూడా తగ్గింది. జీవితాలు సినిమాల్లోలాగా, టీవీల్లోలాగా, పోనీ నవలల్లోలాగా ఉండవనీ, అక్కడ కనిపించేది భ్రమింపజేసే నటనేననీ మర్చిపోతున్నది మన యువత - ముఖ్యంగా చాలా భాగం యువతులు. యువతీ లోకం అంతా నా మీద పడి కరిచినా సరే - యిది సత్యం.

రకరకాల కుటుంబ సమస్యల్లో తలమునకలవుతూ ఆశ్రమానికి వచ్చి తమ కష్టసుఖాలు చెప్పకొనే వారి కబుర్లు వింటున్నప్పడల్లా నాకు మా అమ్మ గుర్తు వస్తుంది. "మగ వాడికి వివాహం జీవితంలో ఒక భాగం మాత్రమే. స్త్రీకి అదే సర్వస్వమైపోతుంది" అన్నదామె ఒక రోజు. "ఎందుకని? ఆమెక్కూడా ఉద్యోగ జీవితం ఒకటి ఉందిగా! కాకపోయినా పొలం పనో మరొకటో మరొకటో చేస్తూనే ఉన్నప్పడు - ఆమెకు ఇదే సర్వస్వం ఎందుకవుతున్నది?" అని అడిగాను. "ఆమె పడే కష్టం వెనుక "నా భర్త కోసం, నా యింటి కోసం, నా పిల్లల కోసం" అన్న భావనే ప్రధానంగా ఉంటుంది. మగవాడు కూడా తన సంసారం కోసమే శ్రమిస్తాడు. కానీ అతని పరిధిలో సంసారం చాలా పెద్దది. అందులో తన మిగిలిన బంధువర్గం, సమాజం, మిత్రులు అందరూ ఉంటారు. అందుచేత భార్యాబిడ్డల స్థానం కొంత చిన్నదవుతుంది" అన్నది. (అప్పడు కాదనుకొన్నప్పటికీ, కాలక్రమాన అది సత్యమేనని అర్థమైంది నాకు.) 'స్త్రీ యింకాస్త స్వతంత్రంగా ఉండగలిగితే ఎంత బాగుండును! తాను కూడా అలా విశాలంగా ఎదిగేదిగా!" అన్నాను. అమ్మ 'నీ మొహం' అనేసింది. "భారతీయ స్త్రీ ఇలా సంకుచితంగా ఉన్నట్లు కన్పిస్తూనే ఎంతో ఉదాత్తంగా ప్రవర్తించగలుగుతున్నది. పనివాళ్లు మరదలు, బావలు, ఆడపడచులు, అత్తమామలు అందరినీ తమ పరిధిలోకి తీసుకోగలుగుతున్నది. అనాదిగా చరిత్ర పరిశీలిస్తే నీకే తెలుస్తుంది. పాశ్చాత్య స్త్రీలు స్వేచ్ఛగా ఆనందంగా ఉన్నారని నీవు అనుకొంటున్నావు. తమ వ్యక్తిగత ఆనందాల కోసం అక్కడి కుటుంబవ్యవస్థను బలిపెడుతున్నారని గ్రహించటం లేదు. ఈ దేశం యింకా యిలా నిలబడి ఉన్నదంటే అది యీ గడ్డ ఆడదాని మూలంగానే" అన్నది. అప్పటికి నాకు పదహారేళ్లు.

నేను పాతికేళ్లదాన్నయ్యాను. అమ్మ ఒక రోజు మా యింటికి వచ్చింది. విజయవాడ సీతారాంపురంలో ఓ రోజుండి వెళ్లిపోతోంది. "నాకేమన్నా చెప్పవా?" అని అడిగాను. ఆమె నవ్వింది అతి మృదువుగా పంచమినాటి వెన్నెల్లు విరిసినట్లు తన సహజధోరణిలో.

"క్రొత్తగా చెప్పేదేముందమ్మా! మగవాడికి కడుపులోనుండీ మెదడులోకి తిన్నగా త్రోవ ఉంటుంది. కడుపు చూచి తన కిష్టమైన వాటితో అన్నం పెట్టే భార్య ముందు మగవాడు పసిపిల్లవాడైపోతాడు. ఆ మాతృత్వం ఆడదానికి ఉండాలి. ఓ రకంగా చెప్పాలంటే ప్రతి ఆడదీ ముందు తన భర్తకు తల్లి అయి, తర్వాతే అతని కొడుక్కి తల్లి కావాలి" అన్నది. "ఎప్పడూ, భోజనాల దగ్గర చర్చలూ, వివాదాలూ రానివ్వకు. అంతేకాదు సంపాదన అన్నది పురుషుడికి దన్నునిస్తుంది. ఇతరులతో పోల్చి చూచి 'వాళ్లలాగా నీవు ఆర్జించలేవు' అన్న భావం చూపించటాన్ని మించి - మగవాడిని సగం చంపేసే మాటా, దూరం చేసే మాటా మరొకటి లేదు. అంతేకాదు - 'నా వాడేగా!' అన్న చనువు కొద్దీ సమ స్థాయిలో మాట్లాడటం కూడా - కనీసం పదిమందీ, ముఖ్యంగా అతని మనుష్యులు ఉన్నప్పడు. ఇది చాలా సున్నితమైన విషయం. ఇవన్నీ నీకు తెలియనివి కావనుకో" అన్నది నవ్వుతూ చివరికి.

నాకు ఐదున్నర పదులు దాటాయి. అమ్మ నాకన్నా పదిహేడేళ్లు పెద్దది. శరీరం కృశించింది. ఏవో చిన్నా చితుకూ వ్యాధులు. పిల్లలంతా ఎటు వాళ్లు అటు జీవితాల వెంట పరుగులు తీస్తూ వెళ్లిపోగా అమ్మా, నాన్నగారూ యిద్దరే. నాన్నగారు ఆమెకన్నా తొమ్మిదేళ్లు పెద్ద. మహావిద్వాంసులు - గొప్ప సేవాభావం. కానీ ఖండిత తీవ్రవాది. పరమకోపిష్టి. తనువులో శక్తి నశించి పోయింది గానీ విద్యా జిజ్ఞాస పోలేదు. పుస్తకం కళ్లకు ఒక్క అంగుళం దూరంలో పెట్టుకొని భూతద్దాల కళ్లజోడుతో చదువుకొంటూ ఉండేవారు. అమ్మ ఆయన్ను పసిబిడ్డను చూచినట్లు అన్నీ వేళకు అమర్చి చూచుకొనేది. అయినాగానీ నాన్న గారికి కోపం వస్తూనే ఉండేది. ఈవిడ ఆయన వాగ్బాణాలకు బలి అవుతూనే ఉండేది.

ఓసారి నేను వాళ్లను చూద్దామని వెళ్లాను. ఆరోజు అమ్మ కొంచెం నీరసంగా ఉంది. అయినాగానీ వంటచేసి, నాన్నగారికి పెట్టింది. కానీ, మంచినీళ్లు పెట్టటం



సాయి వాణి

మర్చిపోయింది. ఆయనకు కోపం వచ్చేసింది. ఛెడామడా తిట్టేసారు. ఆవిడేమీ మాట్లాడకుండా కంచాలు తీసుకువచ్చేసింది.

నాకు చాలా బాధ కలిగింది. "అమ్మా, నీ చిన్నతనంలో నాన్నగారికి భయపడ్డావు. అటుపైన గౌరవంతో భరించావు. ఇప్పడు-యీ చివరి కాలంలో కూడా నువ్విలా వణికిపోవటం ఏమిటో నాకు అర్థం కావటం లేదు" అన్నాను. అమ్మ ఎప్పటిలాగే నవ్వింది. "అమ్మా, నువ్వింత చదువుకున్నావు గదా - ఆలోచిస్తే నీకే తెలుస్తుంది" అన్నది. మెల్లని స్వరంతో యిలా వివరించింది.

తొమ్మిదేళ్లు నిండిన వెంటనే నాకు పెళ్లయింది. పదమూడో ఏట కాపురానికి వచ్చాను. మీ నాన్నగారికి చాలా చాలా చదువుకోవాలని ఉండేది. పెళ్లి వలన డిగ్రీతో ఆపెయ్యవలసి వచ్చిందని ఆయనకు చాలా కోపం. అది ఎవరి మీద చూపించాలి? తనకన్నా చిన్నదాన్నీ, అణకువగా ఉండేదాన్నీ గనుక నా మీదనే. ఎప్పడైనా ఓసారి నాక్కూడా బాగా కోపం వచ్చేది. ఓసారి నేను కూడా ఎదురు అరిచాను. ఆయన నన్ను రెండు దెబ్బలు వేసి, వెళ్లిపడుకొన్నారు. అప్పటికింకా నువ్వు పుట్టలేదు. మేమిద్దరమే. ఆయనకిష్టమని చేసిన పెండలం కూర తినకుండా పడుకున్నారు ఉసూరుమనిపించింది.. వాదం పెంచి, రెచ్చగొట్టి నేను సాధించిందేముంది? మరింత రగడ, మనసుకు మరింత కష్టం, ఇరుగుపొరుగులు విని నవ్వు కోవటం తప్ప! నా మీద నాకే చికాకువేసింది. మెల్లగా వెళ్లి అన్నం, కూర కలిపి తెచ్చి ఆయన్ను నిద్రలేపి బ్రతిమాలి తినిపించాను. నా మనసు చల్లబడింది".

నా కళ్లలో నీళ్లు దూకుతున్నాయి. ఎప్పడన్నా మేము - అంటే పిల్లలం అలిగి పడుకొన్నా అమ్మ అలాగే బ్రతిమిలాడి తినిపించేది. నాకు అమ్మను కౌగిలించుకొని ఏడవాలనిపించింది.

"పదిమందిలో అవమానకరంగా మాట్లాడితే నీకు నాన్న గారి మీద అసహ్యం వెయ్యలేదూ?"

"పిచ్చిదానా, నన్ను అవమానిస్తున్నాననుకొని ఆయన్ను ఆయనే అవమానించుకొన్నారమ్మా! పాపం, చూడు - మన చుట్టాలందరూ నాన్నగారిని కోపిష్ఠి అంటారు. ఆయన ముందు నేను చాలా శాంతమూర్తిలా కన్పిస్తున్నాను.

అలా తనకు తానే చెడ్డపేరూ, నాకు మంచిపేరూ కూడా తెచ్చారు. ఒక్కొక్కసారి ఆయన్ను చూస్తే జాలివేస్తుందే!" నాకు విచిత్రంగా ఉంది యీ అమ్మ భావన. ఈవిడ భర్త దుడుకుతనాన్ని తప్పనిసరై భరించలేదా-ఆనందంతో భరించిందా? "ఇన్నాళ్లూ సరే - యిప్పుడైనా కనీసం మమ్మల్నైనా నాన్నగారితో గట్టిగా మాట్లాడ నీయవేం మరి!" అన్నాను రవ్వంత విసుగ్గా.

"ఓసారి మీ అన్నయ్య ఏదో అన్నాడు. ఆ రోజు నాన్నగారు సరిగా భోం చెయ్యలేదు. రాత్రి పడుకోబోతూ నన్ను పిలిచి "ఇన్నేళ్లకు నా కంటె పిల్లలే దగ్గరి వాళ్లయ్యారా నీకు!" అన్నారు. అప్పుడాయన కళ్ల వెనుక ప్రతిఫలించిన ఆయన హృదయం నన్ను ఎంత కదిలించిందో నీకు తెలియదు. ఆ కాస్సేపు కోపమే తప్ప ఆయన దుష్టుడు కారమ్మా! "నువ్వు తప్ప నాకెవరి చేత్తో తిన్నా ఆకలి తీరినట్లుండదే!" అనే మనిషిని నేనేమని ద్వేషించను? మీ కోర్టులో ఎలా నిలబెట్టను?"

"పోనీ మెల్లగానే చెప్తాము - ఇలా తిట్టవద్దని" అన్నాను.

"అమ్మాయీ, ఒక్కసారి ఆలోచించు. ఇప్పటికి మా పెళ్లై అరవై ఏళ్లు దాటిపోయాయి. అప్పటినుంచీ ఆయన వరుస యిదే. భరించాను. తీరా యిప్పుడు-"నీకు వయస్సు పైబడింది. నీకు సంపాదన లేదు. ఒంట్లో సత్తువ లేదు. పిల్లలంతా నీకు దూరంగా ఉన్నారు. నేను ఉడకేసి పెట్టకపోతే నీకు దిక్కులేదు. అంచేత నన్ను తిట్టావంటే ఊరుకోను" అన్నాననుకో. ఇది తన జన్మహక్కుగా జన్మంతా చెలాయించిన మనిషి - ఎంత బిక్కచచ్చిపోతారే! పాపం ఈ వయసులో అదెంత అవమానమే ఆ మగ మానవుడికి! అంత దు:ఖ పెట్టటం, అలా ఒంటరినన్న భావన కలిగించి క్షోభ పెట్టటం అవసరమంటావా యిప్పుడు!" అమ్మ కళ్లలో నిండిన నీళ్లు చెంపల మీదుగా జారిపోయాయి.

అమ్మను గాఢంగా కౌగిలించుకొన్నాను. కళ్లు తుడిచి ఆమె ఒళ్లో తలదాచుకున్నాను. ఆరో తరగతికి మించి చదువుకోని యీమెలో ఎంత అవగాహన- ఎంత సానుభూతి- తనను తాను తొక్కి పెట్టుకొనైనా సరే సహధర్మచారిణిగా నిలవటమే తప్ప భర్తను తృణీకరించలేని ప్రేమార్ద్రత! ఇదేనా భారతీయ మాత అంటే! ఇదేనా భర్తకే తల్లి కావటం అంటే? ఇది మహౌన్నత్యమా, బానిసత్వమా! ఏమో! 'ఆమె మహా మానవి మాత్రం ఔను' అనిపించింది.





# దేవుళ్లు-దెయ్యాలు

– పూ॥పూ॥ స్వామి యతీశ్వరానంద

దేవుళ్లను, దెయ్యాలను బయట వెదుకుతూ ఎక్కడికో వెళ్లక్కరలేదు. పూర్వకాలపు మన మహర్షులు, ఎంత ఆధ్యాత్మికతా గరిష్ఠులో అంత మానసిక శాస్త్ర నిపుణులు కూడా. ఉపనిషత్తులలో చెప్పబడిన చాలా కథలు ఈ విషయాన్ని నిరూపిస్తాయి. బృహదారణ్యకోపనిషత్తులోని ఒక కథ ప్రకారం ప్రజాపతి మొట్టమొదటి సృష్టికర్త. ఒకసారి ఆయన తన సంతానమైన దేవతలు, మానవులు, దానవులు అనే మూడు రకాల వారికీ కలిపి 'ద' అన్న ఒక్క అక్షరాన్నే ఉపదేశంగా యిచ్చారు. మానవులు దానిని దత్త (దానం)గానూ, దేవతలు దమం (దమ్యత - నిగ్రహం)గానూ, దానవులు దానిని దయగానూ స్వీకరించారు. మానవులకు పిసినారితనం ఎక్కువ గనుక వారు దాతృత్వం అలవరచుకోవాలనుకున్నారు. దేవతలకు భోగలాలసత ఎక్కువ. అందుచేత ఇంద్రియ నిగ్రహం అలవరచుకోవాలనుకొన్నారు. రాక్షసులకు క్రూరత్వం ఎక్కువ. అందువలన క్రూరత్వం కట్టిపెట్టి దయాగుణం పెంచుకోవాలనుకొన్నారు.

ఆది శంకరాచార్యుల వారు ఈ కథకు భాష్యం చెప్తూ మానవ స్వభావాలను ఇలా వివరించారు-మానవులు కాకుండా దేవతలు, రాక్షసులు అంటూ వేరే ఎవరూ లేరు. మానవులలో ఉన్న స్వయం నియంత్రణే దీనికి కొలబద్ద. దమం, దానం, దయ వంటి సుగుణాలే మానవులలోని తరగతులను నిర్ణయిస్తాయి. మంచి లక్షణాలు కలిగి ఉన్నా సంయమనం లేనివారు దేవతలు, దురాశతో నిండినవారు మానవులు, కరుడుగట్టిన కాఠిన్యంతో ఇతరులను హింసించి ఆనందించేవారు దానవులు. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాల ఆధిక్యతను బట్టి ఎవరినైనా దేవతలు, మానవులు, దానవులుగా వర్గీకరింపవచ్చు. కాబట్టే వారి వారి స్వభావాలననుసరించి ఒకే ఉపదేశాన్ని మూడురకాలుగా అర్థం

చేసుకున్నారు. పై మూడు నియమాలను అందరూ తప్పనిసరిగా సాధన చేయాలి. ఆ దేవ మానవ దానవ స్వభావాలు అందరిలోనూ ఉన్నాయి. మనలోని నీచస్వభావాలను నిగ్రహించగల సమన్వయం ఎంత ఎక్కువగా ఉంటే అంత ఉన్నతమైన తరగతికి చెందుతాము. (బృహదారణ్య కోపనిషత్ భాష్యం).

ముండకోపనిషత్తులోను, శ్వేతాశ్వతరోపనిషత్తులోని రెండు అందమైన పిట్టల కథ ఉంది. మంచి నేస్తాలైన ఆ పిట్టలు ఒకే చెట్టు మీద నివసించేవి. అజ్ఞానంలో ఉన్న ఒక పిట్ట ఆ చెట్టు మీది తీపి, చేదు పళ్లను మార్చి మార్చి తింటూండేది. రెండవ పిట్ట చిటారు కొమ్మన నిశ్చలంగా ప్రశాంతంగా కూర్చొని ఉండేది. రజోగుణ ప్రాబల్యం వలన రకరకాల కోరికలతో సుఖాల కోసం వెంపర లాడే సాధారణ మానవునితో మొదటి పిట్టను పోల్చవచ్చు. సత్త్వగుణ సంపత్తితో తులదూగే మానవుని వంటి రెండవ పిట్ట ఆ చెట్టు పళ్ల కోసం ఏ మాత్రం ఆశపడక నిశ్చలంగా, ప్రశాంతంగా ఆత్మారామునిలా కూర్చొని ఉంటుంది. చేదు, తీపి పళ్లు తినే పిట్ట వాటి వలన సంతృప్తి చెందక, పైన నిశ్చలంగా కూర్చున్న రెండవ పిట్టను అప్పుడప్పుడూ చూస్తూ ఉంటుంది. తన స్నేహితుని పట్ల ప్రేమ పొంగి జాలువారడం వలన తాను కూడా పైకి చేరుకొని, అతనితోపాటు హాయిగా ఉండాలని ఊర్ధ్వదిశలో ప్రయాణం మొదలుపెడుతుంది. కానీ, మరొక పండు కనిపించటంతో ఆగిపోతుంది. అలా ఆగుతూ, వెడుతూ చివరికి- తనకు కలిగే కోరికలే తన పయనానికి అడ్డంకులని గ్రహిస్తుంది. వాటిని సంపూర్ణంగా త్యజించి, పై పిట్టను చేరుకొని, తామిద్దరూ ఒకటేనన్న పరమ సత్యాన్ని అర్థం చేసుకుంటుంది. తన అజ్ఞానం వల్లనే రజోగుణం చేత చిక్కి, కోరికలను బానిసగా మారానని అర్థం చేసుకుంటుంది. ఈ "రజోగుణ ప్రభావాన్ని తగ్గించుకున్నప్పుడే తనలోని పశుస్వభావాన్ని అధిగమించడం సాధ్య పడుతుందని కూడా తెలిసి వస్తుంది. అప్పుడే ఆత్మ సాక్షాత్కారం అవుతుంది.





# గురుసేవ-ఏకనాథ భాగవతం

(ఏకనాథ భాగవతం మహారాష్ట్ర దేశంలో నిత్య పారాయణ గ్రంథంగా భావిస్తారు. నారద వసుదేవుల సంభాషణ - జడ భరతునితో గోష్ఠి - ఋషభ పుత్రులు, జనక మహారాజుల సంవాతం - భక్తుని లక్షణాలు - సచ్ఛిష్య లక్షణాలు, సద్గురు లక్షణాలు - శ్రీ కృష్ణోద్ధవ సంవాదం - యదు అవధూతల సంవాదం - నిష్కామ ధర్మాచరణ - సత్సంగ శక్తి - ఇలా ఎన్నెన్నో విధాలుగా భాగవతంలోని లోతులను తడిమి, చక్కని ఆధ్యాత్మిక సంహితగా రూపొందించారు ఏకనాథులు దీనిని. స్వయంగా నిర్మలాంత:కరణులూ, స్వయంగా తపస్వులూ అయిన ఏకనాథుల వారు స్వీయానుభవ జ్యోతి వెలుగులో ఉద్ధవకృష్ణ సంవాదాన్ని సరళంగా సూటిగా చూపించారు. అందులో చిన్నభాగం చూద్దాం.

**- ప్రధాన సంపాదకులు)**

మన లోపలి సంసారాన్ని పూర్తిగా నాశనం చేయటానికి ముఖ్యంగా గురుసేవ చేయాలి. ఈ సాధనే శ్రేష్ఠమయినది. గురుభక్తులు పరమ భాగ్యశీలురు. ఉద్ధవా! ఎవరు వేదంలోనూ, బ్రహ్మజ్ఞానంలోనూ నిష్ణాతులయి ఉండి శిష్యులకు జ్ఞానబోధ సమర్థవంతంగా చేస్తారో వారు సద్గురువులని తెలుసుకోవాలి.

తమ స్వరూపంతోనే శిష్యులను తృప్తి పరచగలవారే నిజంగా సద్గురువులు. ఆయనకు తప్ప సద్గురుత్వం వేరెవరికీ కలుగదు. ఆ సద్గురు సేవా విధానం నీకు నేను వివరంగా చెపుతాను. గురుసేవ చేసేవారు సర్వకర్మలు ధర్మాలు చేసేవారి కంటే గొప్పవారు. గురువును తండ్రితో సమానం అందామా అంటే తండ్రి ఒక్క జన్మలోనే ఉంటాడు. కాని సద్గురువు సనాతన మాత అయి ఉన్నారు. ఆయన సర్వ జగత్తుకీ తల్లీ, తండ్రీను.

గురువును తల్లితో సమానం అని అందామా అంటే తన గర్భంలో జన్మించి నందువల్లే తల్లికి ప్రేమ ఉంటుంది. కానీ, గురువు పునరపి జననం, పునరపి

మరణాలను నివారణ చేసి బిడ్డ కంటే అధికంగా ప్రేమిస్తారు. కడుపు నుండి బయటపడిన తరువాత పుత్ర మమకారం తల్లి శిశువుపై ప్రేమను పెంచుకుంటుంది. కానీ గురుమాత జ్ఞానాన్ని మన కడుపులో ప్రవేశపెట్టి, స్నేహంతో మరింత ప్రేమను చూపుతుంది. గురువును కులదేవత అని అందామా అంటే కులదేవతకు ఆయా కులధర్మాలలో మాత్రమే పూజ్యత ఉంటుంది. కానీ గురువు ఆ కులదేవతలందరికీ కూడ దేవతే అయి ఉంటారు. మన ప్రతి కర్మలోనూ వారికి మాన్యత కలుగుతుంది.

గురువును యజమాని అనటం కుదరదు. యజమాని మన మరణాన్ని ఎన్నటికీ తప్పించలేడు. కానీ సద్గురువు అంటే జనన మరణాలను తప్పిస్తారు. అందువల్ల గురుదేవుడే అన్నివిధాలా యజమాని. గురువును కల్పతరువుతో సమానం చేద్దామంటే కల్పతరువు ఎంత కావాలని కోరామో అంతే దానం చేస్తుంది. కానీ సద్గురువు పూర్ణ నిర్వికల్పతనే ప్రసాదిస్తారు. ఈ నిర్లోభత వలన గొప్ప దానం చేసినట్లవుతుంది.

చింతామణి అనేది ఏ విషయాన్ని గూర్చి చింతిస్తామో ఆ వస్తువునే ఇస్తుంది. కానీ సద్గురువు మనలోపలి చింతనే సమూలంగా నశింపచేస్తారు.

కామధేనువు ఇచ్చే క్షీరదానం మనం ఎంత కోరతామో అంతే ఉంటుంది. కానీ సద్గురువు స్వానందం అనే క్షీరం ప్రసాదించి ఇచ్ఛనే నశింపజేస్తారు. గురువు సముద్రమే అనుకుందామా అంటే అది గంభీరంగా లోతుగా ఉన్నా గానీ ఎప్పుడూ ఉప్పగానే ఉంటుంది. కానీ గురువు ఎప్పుడూ మధుర స్వానందంతో నిండి ఉండటం వల్ల ఆత్మబోధతో అత్యంత మాధుర్యం ప్రసాదిస్తారు.

అందువలన గురువే తల్లి తండ్రి. గురువే స్వామి. గురువే కులదేవత. గురువు లేకుండా అన్యదేవతల స్మరణే జరగదు. శరీరం, వాక్కు, మనసు, ప్రాణం - వీటి ద్వారా ఎవరు గురువును తెలుసుకుంటారో, మిగిలిన వాటిని నిరసిస్తారో, అనన్యభావంతో గురువునే స్మరిస్తారో - వారి భక్తినే గురుభక్తి అంటారు. రెక్కలు రాని పక్షి పిల్లలు సదా తల్లి ధ్యాసలో ఉన్నట్లుగా వీరు జాగ్రత్, స్వప్న, సుషుప్తవస్థలు





మూడింటిలోనూ కూడా గురువును తప్ప అన్యాన్ని స్మరించరు.

గురువు, భగవంతుడు - ఈ రెండూ ఒక్కరే అన్న భావంతో ఎవరు నిశ్చయ పూర్వకంగా భజిస్తారో (సేవిస్తారో) వారే గురుసేవకులవుతారు. వారు తప్ప మిగిలిన వారు సంశయాత్ములై పతనం చెందుతారు. నాతో ఐక్యం కావాలని ఎవరు అత్యంత ప్రేమతో గురుసేవ స్వీకరిస్తారో వారు త్రిలోకాలలో ధన్యులవు తారు. 'గతంలో భగవత్సేవ గొప్పదన్నారు - ఇప్పడు గురుసేవ గొప్పదంటున్నా రేమిటి?' అంటున్నారా? నిజంగా సద్గురువు నా మూర్తే అని గ్రహించండి. దీనిలో మీకు ఏ సంశయమూ వద్దు.

సరైన గురుభక్తికి నోటిలో సద్గురునామం, హృదయంలో గురుప్రేమ, దేహంలో సద్గురు కర్మ - యివే రాత్రింబగళ్లు నడుస్తుంటాయి. గురువు ఉండే చోటనే ఇతని సర్వ మనోధర్మాలు ఉంటాయి. గురుధ్యానమే తమ ధర్మకర్మలు అనుకుంటాడు. గురువు మూర్తినే హృదయంలో ప్రతిష్ఠించుకొంటాడు.

"సద్గురు పాదాలు కడిగేందుకు నీరు నేనే కావాలి. చరణాలను కడిగేదీ నేనే, ఆపాద తీర్థం సేవించేదీ నేనే. సద్గురువు చరణ ధూళి నేనే స్వయంగా కావాలి. చివరికి గురువు పాదుకలు కూడా నేనే కావాలి. వాటిపై యితరులను చేయి కూడా వెయ్యనివ్వను. గురువు ఏ వస్త్రం ధరిస్తారో ఆ ఉత్తమ వస్త్రం నేనే కావాలి. చివరికి స్వామి పాదాలు తుడిచే వస్త్రాన్ని కూడా నేనే కావాలి. ఆయన తనువున అలదిన చందనం, అర్చించే పుష్పాలు - అన్నీ నేనే కావాలి" ఇలా ఉంటాయి సద్గురు భక్తుని ఆలోచనలు.

"గురువు ఏ కథ చెప్పినా నేనే శ్రోతనవుతాను. ఆయన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆయన కరుణతో అందుకొని చెప్పే వక్తనూ నేనే" అనుకొంటారు. దైవయోగంతో ఒకవేళ గురువు దూరంగా వెళ్లినా- భక్తిబలంతో వారు మనసుకు దగ్గరగానే ఉంటారు. వారికి సద్విద్యా శాస్త్రం కూడా సహజంగానే అలవడుతుంది. గురుసేవకు దూరంగా ఉన్నా దగ్గరగా ఉన్నా సరైన భక్తుని భక్తిలో భేదం ఉండదు. తమ పంచప్రాణాలూ గురువుపైననే నిలిపి, అధికాధిక ప్రేమతో ఏకాగ్రత సాధించటం వలన వారి జన్మ సఫలీకృతమవుతుంది.

# శ్రీమద్భగవద్గీత–ప్రయోజనం

మనలో చాలామంది భగవద్గీతా పారాయణ చేస్తాము, వింటాము. కాని గీత యొక్క బోధాసారాన్ని మనము దైనందిన జీవనంలో ఉపయోగించు కోవాలంటే దాని అవసరము, అర్థము మనకు తెలియాలి. కనీసం మనకు తెలిసి గూడ, ఆచరించనటువంటి అనేక విషయాలు గీతలో వున్నాయని తెలిస్తే, ఆ విషయాలను మననం చేసుకొంటూ జీవితంలో ఆచరణలోకి తెచ్చుకుంటే మనం బాగుపడతాము. కనుక గీతాబోధ ప్రవచనాలుగా కాకుండా, పరిచర్చల ద్వారా జనబాహుళ్యానికి అందిస్తే బాగుంటుందని అనిపిస్తుంది.

ప్రతి మానవుడు దు:ఖము పోవలెను, సుఖము రావలెను అని కోరుకుంటాడు. ఆ సుఖం కూడ, అనిత్యమైన తాత్కాలిక సుఖం కాకుండా, శాశ్వతమైనదిగా ఉండాలనుకొంటాడు. ఇట్టి నిత్యసుఖాన్ని ఆత్మానందము అంటారు. ఇట్టి ఆనందము గాఢనిద్రలోగాని, సమాధిలోగాని లభ్యమవు తుందని మనకు అనుభవములో తెలుసు. ఈ రెండు స్థితులలోనే కాకుండా మనము మెలకువతో నుండి దైనందిన కార్యాలు చేస్తూ గూడ ఆత్మానందము పొందే పద్ధతిని మనకు గీత బోధిస్తుంది.

మనిషి సుఖాన్ని అనిత్యమని ఒప్పకొంటాడు కాని దు:ఖము గూడ అనిత్యమేనని మరచిపోతాడు. సుఖదు:ఖాలు రెండూ అనిత్యమని గుర్తుంచు కొంటే, మన జీవితంలో చాలా సమస్యలు సమసిపోతాయి. ఇంకా చెప్పాలంటే సుఖం పోవటమే దు:ఖము. దు:ఖము పోవటమే సుఖము. అంటే యివి రెండు ఒక దాని తరువాత ఒకటి తరంగాలుగా వస్తాయి. చావు పుట్టుకల దగ్గర నుంచి, నీటి అలలు, గాలి ప్రవాహము, శబ్ద తరంగాలు, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు మొదలయినవన్నీ తరంగాలుగా నడుస్తూ ఉంటాయి. ఇదే చైతన్యము. లోకంలో యీ చైతన్యమే కనుక లేకపోతే జడత్వము, నిస్తబ్ధత ఏర్పడి ప్రకృతి స్తంభించి పోతుంది. ఇది ఒక లౌకికజ్ఞానం, ప్రకృతికి నడవడి. సుఖదు:ఖాల స్థాయి-అంటే తీవ్రత, ఎంత తక్కువగా ఉంటే, అంత ఎక్కువ ఆనందాన్ని మనిషి పొందుతాడు, ప్రకృతి స్పందిస్తుంది. దీనినే హైఫ్రీక్వెన్సీ తరంగాలంటారు. నీటి తరంగాల కంటే గాలి తరంగాలు, గాలి తరంగాలకంటే శబ్ద తరంగాలు, శబ్ద తరంగాల కంటే కాంతి తరంగాలు, కాంతి తరంగాల కంటే మనోతరంగాలు శక్తివంతమైనవి. ఇక ఆత్మ తరంగాలను గూర్చి చెప్పనే అక్కరలేదు. అవి అనంత మైన ఆత్మానందాన్ని యిస్తాయి ఇదంతా భావావేశం.





## బాలవాణి

# దేవుడికన్నా గొప్పవాడు

– మాతాజీ

అక్బరు భారతదేశంలో చాలా బలమైన శక్తిగా రూపొంది రాజ్యపాలన చేస్తున్నాడు. అతని ప్రాపకం కోసం ప్రాకులాడే ఛోటామోటా రాజులంతా ఆయనను ఆకాశానికెత్తేస్తూ పబ్బం గడుపుకొంటూ ఉండేవారు. వారిలో స్వాభిమానం లేని రాజపుత్ర ప్రభువులు కూడా ఎందరెందరో ఉండేవారు. అక్బరు ఆస్థానంలో చిరకాలంగా ఉండి, ఆయనకు సన్నిహితుడిగా, తన మేధస్సుతో విఖ్యాతుడైన బీర్బల్ (వీరబలుడు)కు లోలోపల చిన్నతనంగా అనిపించేది. రాచబిడ్డలైన వాళ్లందరూ భట్రాజుల్లా అక్బరును పొడుగుతుండటం, అక్బరు రోజురోజుకూ అహంకరిస్తూండటం బీర్బల్‌కు అసహనం పెంచింది కూడా. ఒకరోజు వాళ్లందరికీ బుద్ధి వచ్చేలా చెయ్యాలనుకొన్నాడు. అందుచేత వాళ్లతో పాటు తాను కూడా అక్బరు పాదుషాను పొగడటం ప్రారంభించాడు. అదేరోజు అక్బరు ఒక రాజద్రోహిని-అంటే తనకు ద్రోహం తలపెట్టిన బంధువొకడిని తన రాజ్యంలోనుంచీ వెళ్లగొట్టాడు. దాన్నే 'దేశబహిష్కరణ' అంటారు.

రాజు తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదనీ, న్యాయబద్ధమైనదనీ, బంధుప్రీతి అన్నది లేకుండా ధర్మనిర్ణయం చేయటం ప్రభువుల వారికే చెల్లిందనీ - యిలా తలాతోకా లేని పొగడ్తలేవో పోటీపడి మరీ పొగుడుతున్నారు. బీర్బల్ తాను కూడా వాళ్లకు వంత పాడసాగాడు. రెండు నిముషాలయ్యాక అతడు చెయ్యెత్తి అందరినీ ఆగమని సైగ చేసాడు.

“మనం యిన్నివిధాల మాట్లాడటం అనవసరం. పాదుషావారు పరమాత్ముని కన్నా గొప్పవారు” అన్నాడు. అక్బరు చాలా పొంగిపోయాడు. కానీ, ఆ సంతోషాన్ని కాస్త అణుచుకొంటూ “అదెలాగ బీర్బల్!” అని అడిగాడు. బీర్బల్ వంగి సలాం చేసి, ఇలా అన్నాడు - “అవును జహాపనా! తమరు ఆ రాజద్రోహిని తమ రాజ్యంలో నుంచీ బయటకు వెళ్లగొట్టగలిగారు. భగవంతుడు ఆ పని చచ్చినా చెయ్యలేడు గదా! అందుచేత తమరు ఖుదా కన్నా గొప్ప వారే!” అక్బరు తెల్లబోయాడు. బీర్బల్ భావం ఆయనకు అర్థమైంది. “నా యీ చిన్నరాజ్యం చూచుకొని నేను పొంగిపోతున్నాను. వీళ్ల పొగడ్తలన్నీ విని అహంకారం పెంచుకొంటున్నాను.

బీర్బల్ నా కళ్లు తెరిపించాడు. సర్వలోకాలూ తనవే అయినా ఆ పరమాత్ముని ముందు నేనెంత!" అక్బరు చిరునవ్వుతో బీర్బల్ వైపు చూచాడు. బీర్బల్ అర్థం చేసుకొని నవ్వాడు.

## తొందరపాటు

ఓ పెద్దాయనా, పాతికేళ్ల కొడుకూ రైల్లో ప్రయాణం చేస్తున్నారు. ఎదురు సీట్లలో చాలామంది జనం-పిల్లా, పెద్దా. యువకుడు కిటికీ ప్రక్కనా, వాళ్ల నాన్నగారు అతని ప్రక్కనా కూర్చున్నారు. యువకుడు చాలా ఉత్సాహంగా, పసిబిడ్డలకుండేటువంటి సహజోల్లాసంతో కన్పిస్తున్నాడు. మధ్యమధ్య చేతులు బయటపెట్టి గాలి తగుల్తోంటే హాయిగా నవ్వుతున్నాడు. ఉండిఉండి తండ్రిని తట్టి "చూడండి నాన్నగారూ, చెట్లు ఎలా వెనక్కు పరుగెడుతున్నాయో!" అంటున్నాడు. "అదుగో, ఆ బుజ్జి దూడ చూడండి ఎంత ముద్దుగా ఉందో!" అంటున్నాడు ఇంకోసారి.

పెద్దాయన చిరునవ్వుతో తల ఊపుతూ కొడుకు ఉత్సాహంలో పాలుపంచుకొంటున్నాడు. ఎదురుగానూ, ప్రక్కనా కూర్చున్న వాళ్లకు మాత్రం ఆ యువకుడి ప్రవర్తన వింతగా తోస్తోంది. వాళ్ల పిల్లలు కూడా "యింత పెద్దకుర్రాడు మాలాగే అరుస్తున్నాడేమిటి!" అన్నట్లు చూస్తున్నారు. హఠాత్తుగా యువకుడు "నాన్నారూ, చూడండి చూడండి, ఎండలో వాన కురుస్తుంటే ఎంత బావుందో! నీళ్ల చుక్కలు భలే మెరుస్తున్నాయి గదూ!" అన్నాడు. చెయ్యి బయటకు చాపి, వానచుక్కలతో తడిపి ముఖం తుడుచుకున్నాడు. అంతలో పల్లెప్రక్కగా వెడుతోంది రైలు. బడి నుంచీ యింటికి వెళ్లే పిల్లలు పలకలు తలమీద పెట్టుకొని పరుగులు తీస్తున్నారు. యువకుడు అది చూచి ఎంతో సరదాపడ్డాడు. వాళ్లకు చెయ్యి ఊపాడు. రెండు నిమిషాల తరువాత వచ్చిన చెరువులో ఆరవిచ్చి ఉన్న కమలాలను చూచి "అబ్బ! ఎంత బావున్నాయో!" అన్నాడు పెద్దగా.

ఎదురుసీట్లో ఉన్న వారిలో ఒక నడివయస్కుడు ఆ యువకుడి పరిస్థితికి చాలా జాలిపడ్డాడు. "పాపం, వయసుకు తగినట్లు మెదడు ఎదగలేదు" అనుకొన్నాడు. కొంచెం ముందుకువంగి, "అబ్బాయిని డాక్టరుకు చూపించి వైద్యం చేయించకపోయారా!" అన్నాడు. ఈయనలోని భావం యువకుని తండ్రికి అర్థమైంది. ఆయన మెత్తగా నవ్వి, యిలా అన్నాడు - "మేమిప్పుడు డాక్టర్ దగ్గరినుండే వస్తున్నాం. మా అబ్బాయి కళ్లకు ఆపరేషన్ చేసారు ఈ మధ్యనే. ఇవ్వేళే తొలిసారిగా వాడు ప్రపంచాన్ని చూస్తున్నాడు". ఎదురుసీట్లో ఆయన సిగ్గుపడి బాధతో తలవంచుకున్నాడు. తను తొందరపడి ఆ యువకుడిని మతి అంతగా లేని వాడనుకున్నందుకు.





## మాతృ సందేశం

(గత సంచిక తరువాయి) - శ్రీ మల్లెమాల

తే. ఏగె నేబది యేడేండ్లు ఎఱ్ఱకోట
కొమ్ముపై జాతిబావుటా కొలువుదీరి;
కాని ఫలమేమి? నేటికీ కష్టజీవి
బ్రతుకు మిగిలెను మిగుల దుర్భరముగానె. 1

క. పసితనమున వసివాడెడు
కసిగందుల దలచు కొనిన కనులు చెమర్చున్
కుసుమముల నలిపివేసిన
ప్రసవించునె? భూరుహములు ఫలసంతతులన్ 2

సీ. ఆస్తి పంపకమున కంగీకరింపని
సోదరు హతమార్చ జూచు నొకడు
ఆలి చెప్పడు మాట లాలించి క్రుద్ధుడై
అమ్మను దుర్భాషలాడు నొకడు 3

సీ. అవినీతినే నిత్య మాహారముగ మెక్కి
మదమెక్కి దున్నలై మసలువారు
స్వార్థమే సకలార్థ సాధనమ్మని యెంచి
చెలగి దుష్కృత్యముల్ సేయువారు
చట్టాల కనులకు పట్టుగంతలు కట్టి
పగలె దోపిడికి పాల్పడెడు వారు
దుడ్డు కమ్ముడువోయి గొడ్డళ్లతో తలల్
నరికి నిర్భీతిగా తిరుగువారు

తే. కుటిల తంత్రాలతో వోట్లు కొల్లగొట్టి
అడ్డదారుల గద్దెల నాక్రమించి

నీతిసూత్రాలు వల్లించు నేతల గని
కడుపు రగులుచునున్నది కవికుమార!
సీ. పుట్టి పుట్టకముందె పొట్ట కూటికి బిడ్డ
నంగడిలో బెట్టి అమ్ము తల్లి
ఎండిపోయిన రొమ్ము నేడ్చెడు పసికూన
కందించి మదిలోనె కుందుతల్లి
తలదాచుకొన నింత నెలవుకు నోచక
వీధి ప్రక్కనె ప్రసవించు తల్లి
ఎంగిలాకుల మీది కెగబ్రాకు బిడ్డను
వారించి గొల్లున వగచు తల్లి
తే. ఎన్నొ నోములు నోచి నే కన్నబిడ్డ
నెటుల బ్రతికించు కొందునంచేడ్చు తల్లి
మోములందున పొగవోలె ముసురుకొనిన
బాధ కర్థము నుడువంగ బ్రహ్మ తరమె?
తే. ప్రతిదినమ్మున ఆకలి బాధతోడ
క్రుంగి కృశియించి సహనమ్ము గోలుపోయి
కోరిచావును వరియించు వారు నేడు
అగణితమ్ముగ కన్పింతు రన్నిదెసల.
సీ. అన్నదాతలు రైతు లనుదిన మ్మాకలి
బాధతో మ్రగ్గుట పరువు చేటు!
పట్టుబట్టలు నేయు పనివారికే కట్టు
బట్టలు కరవౌట పరువుచేటు!
ఉస్సు రుస్సురటంచు యువత నిరుద్యోగ
పర్వాన గుములుట పరువుచేటు!
కులమత ద్వేషాలు కొరవి దయ్యములట్లు
ప్రజల పీడించుట పరువు చేటు!
తే. కలికమునకైన గాంధీజీ కలలు గనిన
గ్రామస్వారాజ్యమే ఒక్క గ్రామమందు
కాగడాబట్టి వెదకిన కానరాదు
భరతజాతికి ఇది యెంత పరువుచేటు.

**(సశేషం)**





# లేఖావాణి

పరమపూజ్య స్వామి వారికి,

పాదాభివందనాలు.

స్వామీ, గత మూడు సంవత్సరముల నుండి మేము సాయిధామం దర్శించుకుంటున్నాము. ఈ మధ్య మాకు మా భూమి సమస్య వచ్చినది. భూమికి బయానా ఇచ్చినాము. అందులో 60% డబ్బులు కట్టినాము. మిగిలిన డబ్బులు సరైన టైములో కట్టనందుకు, కట్టిన డబ్బులకు తగ్గ భూమి మాకు ఇవ్వక, పోనీ డబ్బైనా తిరిగి ఇవ్వక చాలా ఇబ్బంది పెట్టినారు. ఈ సమస్యను బాబాకు నివేదించుకొని తమరు చెప్పిన విధముగా పారాయణము చేసినాను. అందుకు బాబా ఆశీస్సులతో, మీ కరుణతో ఆ భూమి సమస్య నుండి బయటపడినాము. ఇదే బాబాను నమ్ముకున్నందుకు మీ ద్వారా మాకు కలిగిన తొలి మేలు.

తదుపరి నాకు ఉద్యోగము రావలెనని సాయిధామం దర్శించుకున్నాను. స్వామీజీ మళ్లీ పారాయణము కావించమనినారు. శ్రద్ధతో మూడు వారాలు చేసినాను. చివరి వారం ప్రారంభంలో ఇంటర్వ్యూ సమాచారం అందుకున్నాను. చివరి వారం, చివరి రోజున గురువారం రోజున అపాయింట్‌మెంట్ లెటరు అందుకున్నాను. బాబా ఆశీస్సులతో నాకు ఉద్యోగం వచ్చినందుకు చాలా ఆనందముగానున్నది. గురువాక్యం పాటించిన ఫలమిది అనుకున్నాము.

కావున బాబాను నమ్ముకొని, బాబా మీద భారము వదిలేసి నమ్మకము, మరియు శ్రద్ధతో ధ్యానము చేసిన బాబా అనుగ్రహము తప్పకుండా కలుగును. ఇలా రెండు పర్యాయములు బాబా కృపకు పాత్రుడనయ్యాను. నాకీ మార్గం చూపి, ఆశీస్సులిచ్చిన మీకు సాష్టాంగ నమస్కారం గురుదేవా!

- కృతజ్ఞతలతో,

- జి. దయాకర్, సరూర్‌నగర్, హైదరాబాదు.

◆ ◆ ◆

# ఆదిగురువు-దత్తప్రభువు

(గత సంచిక తరువాయి)

## స్వకర్మ - సుకర్మ

పూర్వం విష్ణుదత్తుడనే ఒక బ్రాహ్మణుడూ, అతని భార్య సుశీల ఒక పల్లెలో జీవిస్తూండేవారు. వారి ఇంటి ఎదురుగా ఓ రావిచెట్టున్నది. విప్రదంపతులు సదాచార సంపన్నులు. వారు ప్రతిదినం పూజాదికాలు పూర్తి అయ్యాక ఓ చెంబెడు నీళ్లు ఆ చెట్టుకు పోసేవారు. భోజనాల సమయంలో భూతబలి కోసం పెట్టే ముద్ద ఆ చెట్టు క్రిందే పెట్టేవారు. రావి చెట్టు మీద ఓ బ్రహ్మ రాక్షసుండేవాడు. బ్రాహ్మణ జన్మ ఎత్తి కూడా అయోగ్యకార్యాలతో ఆ జన్మ వ్యర్థం చేసుకొన్నవారు తమ ఘోరపాతకాలకు ఫలితంగా బ్రహ్మరాక్షసులుగా ఉంటారట. మన యీ బ్రహ్మరాక్షసుడు ప్రతిరోజూ విష్ణుదత్తుడు పెట్టే భూతబలి తానే తినేవాడు. కనుక వాడిలోని సంస్కారాలు మారిపోతూ వచ్చాయి. మెల్లమెల్లగా వాడిలో మెత్తదనం చోటు చేసికొన్నది. తనకు రోజూ ఆహారం పెడుతున్న వారికి ఏదో ఒక మేలు చెయ్యాలి గదా అనుకొన్నాడు. ఈ గడ్డ మీద పుట్టి జీవించిన వారికే కాదు - ఇక్కడ అడుగుపెట్టిన దయ్యాలకు, భూతాలకు కూడా యిలాంటి విశ్వాసం, కృతజ్ఞత అనేవి సహజంగా వస్తాయి. అవి ఏ ప్రారబ్ధం చేతనో అణిగి ఉన్నా సత్సాంగత్యంతోగానీ, దైవభక్తితోగానీ తిరిగి వికసించే అవకాశాలుంటాయి. మన బ్రహ్మరాక్షసునికి కూడా అలాటి భాగ్యం పట్టింది.

అతడు విష్ణుదత్తుని ముందు తన నిజరూపంతో నిలబడ్డాడు. "ఓయి బ్రాహ్మణోత్తమా! నీవు పెట్టే భూతబలి తినటం వలన నాలో మార్పు వచ్చింది. దానికి మారుగా నీకేదైనా మేలు చెయ్యాలనుకొంటున్నాను. ఏం కావాలో అడుగు" అన్నాడు. వాడి రూపం చూచేటప్పటికే విష్ణుదత్తుడికి పై ప్రాణం పైనే పోయినట్లనిపించింది. అతడు భయపడుతూనే "నాకు కోరికలంటూ ఏమీ





లేవు బాబూ! నీ దారిన నీవు పో" అన్నాడు. కానీ, వీడు వదలకుండా పట్టు పట్టాడు. "నీ ఋణానపోలేను, ఏదైనా కోరుకో" అని మళ్లీ మళ్లీ అనసాగాడు. ఇక విధిలేక విష్ణుదత్తుడు "నాకొక్క కోరిక ఉంది ఎప్పటినుంచో. అది తీరేది కాదని నిరాశతో ఊరుకొన్నాను. నీవు ఇంతలా అడుగుతున్నావు గనుక చెప్తున్నాను. నాకు దత్తాత్రేయస్వామిని చూపించు" అన్నాడు. ఒక్కక్షణం బ్రహ్మ రాక్షసుడు కంగారుపడిపోయాడు. అంతలోనే తేరుకొని, "అయ్యా, మాబోటి పాపులం ఆయన పరిసరాల్లోకి కూడా వెళ్లలేము. ఆయన ఓ పట్టాన దొరికే స్వామి కాదు. మహా మాయలమారి. ఏ రూపంతో వస్తాడో, ఎక్కడ కన్పిస్తాడో చెప్పలేము. మూడుసార్లు ఆయనెక్కడుందీ వచ్చి చెప్తాను. ఆయన దగ్గరకు వెళ్లవలసింది మాత్రం నువ్వే. నేను కాదు సుమా!" అన్నాడు. సంతోషంతో ఒప్పుకొన్నాడు విష్ణుదత్తుడు.

కొద్దిరోజుల తరువాత బ్రహ్మరాక్షసుడు వచ్చి "రా, రా! దత్తస్వామి దగ్గర్లోకే వచ్చాడు" అని తీసుకువెళ్లాడు అతన్ని. పరుగున వెళ్లిన విప్రునికి కనిపించిన వాడెలా ఉన్నాడు? ఒళ్లంతా మడ్డికట్టిపోయి ఉంది. ఎర్రటి కళ్లు - కల్లు కంపు - తూలుతూ వాగుతూ తిరుగుతున్నాడు. అది చూచేసరికి విష్ణుదత్తునికి వాంతి వచ్చినంత పనయింది. "ఛీ, ఛీ! ఇతడేం దత్తాత్రేయుడు! ఈ బ్రహ్మ రాక్షసుడికి ఈయన దేవుడిలా కన్పించాడా! ఛీఛీ!" అని అసహ్యించుకొని వెనుకకు వచ్చేసాడు. ఇది విని బ్రహ్మరాక్షసుడు "అయ్యయ్యో ఆయన అలాగే కన్పిస్తాడయ్యా! నేను ముందే చెప్పానుగా - గొప్ప మాయలమారి వాడని! అవకాశం పోగొట్టుకున్నావు!" అన్నాడు. మరోసారి కూడా ఇలాటి అవకాశం వచ్చింది. రాక్షసుని మాట విని పరుగు పరుగున వెళ్లిన విష్ణుదత్తునికి మెడలో ఎముకల దండ వేసుకున్న చండాలుడొకడు కనిపించాడు. కుక్కలున్నాయి చుట్టూ. అతగాడు వాటితోపాటే ఒక శవాన్ని పీక్కుతింటున్నాడు. "ఈ మనిషి దత్తాత్రేయుడా!" కొంత సందేహం కలిగినా - ధైర్యం తెచ్చుకొని దగ్గరకు

వెళ్లబోయాడు. కుక్కలు భౌభౌమని మీదికెగబడ్డాయి. అయినా తెగించి వెళ్లి నమస్కరించబోయాడు. దత్తుడు కోపంగా చూస్తూ చేతిలో ఉన్న పెద్దఎముక విసిరాడు విష్ణుదత్తుని మీదికి. భయంతో పారిపోయాడు అతడు. 'ఇంకొక్క అవకాశం కలిగిస్తాను. ఆపైన నావల్ల కాదు' అన్నాడు బ్రహ్మరాక్షసుడు. సరే- ఆ సమయమూ వచ్చింది.

విష్ణుదత్తుడీసారి మనసు స్థిరంగా పెట్టుకొని బ్రహ్మరాక్షసుడు చూపించిన వైపుకు వెళ్లాడు. గాడిదల తోలు ఒలుస్తున్నాడొకడు. దాని మాంసఖండాలను పైన ఎగిరే పక్షులకు ఎగరేస్తూ, ప్రక్కనున్న కుక్కలకు పెడుతూ వినోదిస్తున్నాడు. విష్ణుదత్తుడు మిగిలినవేమీ పట్టించుకోకుండా తిన్నగా వెళ్లి అతని కాళ్ల మీద పడ్డాడు. 'స్వామీ, శరణు' అన్నాడు. దత్తుడు తీవ్రంగా కొట్టాడు, తన్నాడు, ముఖం మీద ఊసాడు. ఏం చేసినా పట్టించుకోలేదతడు. పాదాలపైపడి అలాగే ఉండిపోయాడు. చివరికి "నా వెంట పడ్డావు, నీకేం కావాలి నాయనా!" అని వినిపించింది. విష్ణుదత్తుడు చటుక్కున తలెత్తి చూచాడు - ఆ కంఠంలోని మార్దవానికీ, మాధుర్యానికీ ఆశ్చర్యపోతూ. చుట్టూ వాతావరణం అంతా మారిపోయింది. కాషాయాంబరధారియై నిలచి ఉన్న దత్తుడు దర్శనమిచ్చాడు. చుట్టూ సుందరమైన ఆశ్రమం! విష్ణుదత్తుడు పదేపదే నమస్కరించాడు స్వామికి. ఆనందాశ్రువులు రాలుస్తూ స్తుతించాడు. "ఏమి కావాలి నీకు, అడుగు" అన్నాడు దత్తుడు మళ్లీ. విష్ణుదత్తునికేమీ తోచలేదు. స్వామిని కళ్లారా చూడాలనే కాంక్షతో కోరుకున్నాడే గానీ తనకే కోరికలూ లేవు. ఏమి అడగాలి? వద్దు పొమ్మనటం మాత్రం ఎలా? ఆ పిచ్చి బ్రాహ్మణునికి ఏం చెయ్యాలో తోచక - "స్వామీ! ఇవ్వేళ మా ఇంట్లో పితృశ్రాద్ధం (తద్దినం) ఉంది. తమరు భోక్తగా రావాలి" అన్నాడు. దత్తుడు నవ్వుకొని "సరే, నీవు వెళ్లు, నేను స్నానం చేసి వస్తాను" అన్నాడు. విష్ణుదత్తుడు ఇంటికి పరుగెత్తాడు.

**(సశేషం)**





# స్వరాంజలి

- అరవింద

బాబా చెప్పిన బోధలు వినరా
వేదంతో సరిపోలును గదరా ॥ బా ॥
ప్రేమా, త్యాగం, శ్రద్ధా, సహనం
ఉంటే నా వాడవుతాడూ ......
నిర్మల చిత్తం ఉంటే చాలును
నీతోనే నేనుంటానికపై
అన్నాడు బాబా - విన్నావ నీవూ? ॥ బా ॥
సర్వం నాకే నైవేద్యముగా
అనుక్షణమ్మూ ఆరాధనగా
సేవే నీకు ఊపిరి కాగా
జీవించినచో నావాడవెగా
అన్నాడు బాబా - విన్నావ నీవూ ॥ బాబా ॥

# సాయి మార్గం

- ధనుంజయ పరవస్తు

సాయి దేవుడు మనవాడు
తలచిన మదిలో మెదలేవాడు
పిలిచిన వెంటనే పలికేవాడు
కష్టాలెన్నో వచ్చినా ...
నష్టాలెన్నో చుట్టుముట్టినా ...
భారం వేయుట మన వంతు
తీరం చేర్చుట అతని వంతు ॥ సాయి ॥
మనసు తెల్లగా ఉండాలి
మమతలందరికీ పంచాలి
అడుగడుగునందు గుడి ఉంది
ఆత్మీయతలో సుఖముంది ॥ సాయి ॥
అందరిలోన సాయిని చూడు
అందినంతకు సేవను చేయి
నిత్యానందం నీదేలే
సాయి హృదయం నీదేలే ॥ సాయి ॥

# దానం

సేకరణ : కె.ఆర్. విజయకుమార్, మదనపల్లె

శ్లో ॥ దరిద్రాయ కృతం దానం
శూన్య లింగస్య పూజనం
అనాథ ప్రేత సంస్కారం
అశ్వమేథ సమ: విధు:

ఇవి మహాభారతంలోని వాక్యాలు, పేదవానికి దానం చేయుట, పాడుబడిన దేవాలయములోని లింగమును పూజించుట, దిక్కులేని శవాన్ని అగ్ని సంస్కారం చేయుట ఇవి అశ్వమేధ యాగ ఫలితముతో సమానమైన ఫలితమిస్తాయని పంచమ వేదమైన మహాభారతంలో చెప్పబడియున్నది. అయితే యీ మూడింటిలో మొదటి విధానమైన దానం ఎవరికి చేయాలన్నది ముఖ్యం.

పాత్ర మెరిగి దానం క్షేత్ర మెరిగి స్నానం, క్షాత్ర మెరిగి రాజ్యం అన్నారు పెద్దలు పాత్రా పాత్రత చూడక చేసిన దానం వలన పాపం వస్తుంది అన్నారు.

ఉదాహరణకు ఒకాయన పాత్రత చూడక ఒక జాలరికి ఒక పైసా దానం చేశాడు. ఆ పైసాతో ఆ జాలరి ఒక గేలం ముల్లును కొన్నాడు. ఆ ముల్లు చేత అతడు ఎన్ని చేపలు పట్టి చంపాడో తద్వారా వచ్చిన పాపఫలములో సగం దానం చేసిన వానికి సంక్రమించింది. ఇదియొక ఇతిహాసం.

ఇక సరియైన దానం గూర్చి ఆలోచించి సరియైన వానికి దానం చేయుట మంచిదని విశ్వామిత్రుడు తన యజ్ఞరక్షణార్థమై రామలక్ష్మణులను తన వెంట గొనిపోవునపుడు

క్షేత్రమెరిగి స్నానమ్ములను పాత్ర మెరిగి
దానమును చేయవలెనని తలచి మౌని
బలము నతి బల విద్యలు తెలియజేతు
రామ! శుద్ధుండవై వేగ రమ్మనంగ.

శ్రీరాముడు మునీశ్వరుని మాట ప్రకారము సరయూ నదిలో స్నానమాడి





రాగా, బలాతి బల విద్యలు విశ్వామిత్రుడుపదేశించారు. ఇచట విశ్వామిత్రుడు పాత్రా పాత్రత తెలుసుకొని విద్యాదానం చేశాడు. సరయూవు పుణ్యక్షేత్రమైనందున రాముడు స్నానము చేయుటచే పరిశుద్ధుడయ్యాడు. రాముడు స్వతహాగా అంతరశుద్ధి కలవాడు. బాహ్యాంతశ్శుద్ధులు గల రాముడు దానమును పొందుటకు పాత్రుడు అని తెలుస్తుంది. ఇచ్చట మహత్తరమైన విద్యాదానం చేసి విశ్వామిత్రుడు మంచి గురువనిపించుకొని కీర్తిమంతుడయ్యాడు. ఏ విద్య నేర్చుకోవాలన్నా మంచి గురువులుండాలి.

“గురువు లేని విద్య కూడ దెవ్వరికైన - అజునకైన వాని అబ్బకైన” అన్నారు మన యోగి వేమన. దానం చేయువారు కూడా ఏ దానం గొప్పదని యోచించాలి. తాత్కాలికములైన అన్నదానం, వస్త్రదానం, భూదానం, గోదానం వంటివి గొప్పవే! అయినా ఇవి అప్పటికప్పడే గొప్పవౌతాయి. కాని అన్నిటికీ మించినది ఒక విద్యా దానమే!

అతి గుప్త ధనము విద్యయే
ఇతరుల కిడుచున్న కొలది హెచ్చుగు చుండున్
క్షితి గల ధనములలోనిది
అతి గొప్పది దొంగిలింపనలవడని దియున్

అరగనిది, తరగనిది, విరగనిది అందరూ మెచ్చదగినది విద్యా దానమే! విద్యా ధనమే చుట్టము, మిత్రుడు. సమస్త భోగములను, కీర్తిని యొసగునది. విద్యయే గురువు, విద్య గలవాడు ఎచట నున్నను పూజితుడే. కనుక -

విద్యా దానం మహాదానం.

Life ends when you stop dreaming, hope ends when you stop believing, love ends when you stop caring, relation ends when you stop calling.

# మా ఆశ్రమము

- సూర్యకుమారి బి.

ఆధ్యాత్మిక జ్ఞానమునకు ఆశ్రమము ఒక కేంద్రము. మా గురుదేవులు పరమ పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు. బోధించే వాటిలో కొన్నిటిని- కనీసం ఆచరించడానికి, శ్రమలేనివి వ్రాయాలని నా కోరిక.

"ఎవరైనా వారు చేసిన మంచిచెడులకు ప్రతిఫలం అనుభవించి తీరవలసినదే. దాని నుంచి ఎంతటి వారికైనను తప్పించుకోలేదన్నది లోక విదితమే.

సర్వవ్యాపకులైన సాయిబాబాను నమ్ముకోండి. దురాశాపూరితులైన మోసగాళ్లను విశ్వసించకండి.

అహంభావం, గర్వం, స్వార్థపూరితమైన ఆలోచన, కీర్తి, కాంక్ష లేనప్పుడు, తల్లి తండ్రి, ఆస్తులు మరెవ్వరు ఇవ్వలేని మానసిక శాంతి, సంతోషం, సంతృప్తి భగవంతుని నిష్కల్మష హృదయంతో స్మరిస్తూ ఉంటే కలుగుతుంది.

సమర్పణభావంతో చేసేదే సేవ. ప్రతిఫలం మీద ఆసక్తి లేకుండా సర్వం భగవదర్పితం చేసుకుని చేయడములోనే అపరిమితమైన ఆనందము కలుగుతుంది" ఇలా మా గురువుగారు చెప్పే సూక్తులలో ఆచరించడానికి వీలుగా ఉండేవి, సర్వోత్తమమైనవి కోకొల్లలు. వారు తమ ఆరోగ్యం సహకరించక పోయినా ఆశ్రమవాసులమైన మాకు అతి సులువైన మార్గం ద్వారా జనన మరణములు లేని యోగసిద్ధిని పొందే అనేక జ్ఞానబోధనలు చేస్తూ ఉంటే మేము ఏమి చేస్తున్నాము? మమ్మల్ని పట్టి పీడిస్తున్న అజ్ఞానం అనే దీర్ఘ వ్యాధి వలన, పూర్వవాసనలు పోగొట్టుకోలేకపోతున్నాము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములకు ఎంత వరకూ అంటకుండ దూరంగా ఉంటున్నాము"? అనే ప్రశ్న ఎవరికి వారే వేసుకొని ఆత్మపరిశీలన చేసుకొని "అజ్ఞానం" దీర్ఘ వ్యాధికి, మా పరమపూజ్యులైన గురుదేవుల బోధనలు అనే మందులు క్రమం తప్పకుండా సేవిస్తూ (అవి నిరంతరం మననము చేసుకుంటూ ఆచరిస్తూ) ఉండాలి. మనందరం గురుదేవుల ఆకాంక్షను తీర్చాలనీ, అందుకోసం నిరంతర సాధన సవినయముగా, హృదయపూర్వకంగా చెయ్యాలనీ భావిస్తున్నాను. ఆ మేరకు నేను జీవించాలని అనుకొంటున్నాను.

ఇది ఆశ్రమవాసులమైన మా విధి.





# సచ్చిదానందవాణి

- తాతపూడి బ్రహ్మానందశాస్త్రి

సాయీశ్వరుని వల్ల కర్మబంధనాల నుండి విముక్తులైనవారు, కోరికల నుండి వినిర్ముక్తులు, శరీర గృహాదుల పట్ల విరక్తులు - ప్రపంచంలో ధన్యులు. ఎవరి దృష్టికి సాయి తప్ప మరేమీ కన్పించదో వారు భాగ్యశాలురు. హృదయంలో సాయి విశ్వప్రేమను నింపుకొని, నోటితో సాయినామం జపించే వారి నిత్య యోగక్షేమాలూ తాను స్వయంగా వహిస్తాననీ, వారి భారం తానే మోస్తాననీ అన్నారు సాయి. చెవులతో ఆ నామాన్నీ ఆయన సంకీర్తననీ తప్ప ఏమీ వినకుండా పదేపదే అదే నామం మననం చేసుకుంటూ ఉండాలి. అంతరంగంలో సాయిపై అచంచలమైన పవిత్రప్రేమ ఉండాలి. చివరికి అదే ఇహలోక సుఖానికైనా పరానికైనా పనికి వస్తుంది.

మంత్రగాడు మంత్రసిద్ధితో మన కోరికలు తీరుస్తాడు. అట్లాగే గురు పద రజధూళి పడిన నయనాలు జ్ఞానాన్ని చూడగలుగుతాయి. సిద్ధుల లక్షణాలు సాధకులకు సాధనాలు. సాధ్యాన్ని సిద్ధింపజేసుకోవడానికి దీర్ఘ ప్రయత్నం, అభ్యాసం అవసరం. అభ్యాసం లేకుండా చిత్తశుద్ధి లభించదు. చిత్తశుద్ధి లేనిదే జ్ఞానోదయం కాదు. చిత్తవృత్తి నిర్మలమైతేనే ఆత్మప్రాప్తి కలుగుతుంది. అందుచేత ఆత్మ సాక్షాత్కారం కలగనంతవరకు భగవద్భక్తిని - సాయిభక్తిని విడవకూడదు. ఆత్మజ్ఞాన భవన నిర్మాణానికి భగవద్భక్తే పునాది. సాధు "సజ్జన సేవ ముక్తికి నిలయం. గురువు తన భక్తులను స్మరిస్తూనే ఉంటారు. ధ్యేయం, ధ్యాతల స్థానంలో గురుశిష్యులు పరస్పరం విస్మృతిస్థితిని (సమాధిస్థితిని) పొందుతారు. మీరు మీ కర్తవ్యాలు నెరవేర్చుకొంటూనే శ్రీ సాయిని నిరంతర చింతనం చేస్తుంటే ఆయన యిక మిమ్మల్ని విడువడు. అది బాబా ప్రేమమయమైన వాగ్దానం. అదే సచ్చిదానంద సద్గురు వాణి - అదే సాయివాణి.

# శ్రీ సాయి ప్రాతఃస్మరణము

**సేకరణ : సాయి మామ్మగారు**

శ్లో॥ 1. ప్రాతస్మరామి శిరిడీశ ముఖారవిందం
సద్భక్త మానస మధువ్రత సేవ్యమానమ్
భక్తేష్ట దాన నిరతం భవసింధుపోతం
సాయీగురుం శ్రితజనావన కల్పవృక్షమ్ ॥

శ్లో॥ 2. ప్రాతర్నమామి శిరిడీశ పదారవిందం
దుర్వార రోగ హరమౌషధ మద్వితీయమ్
అజ్ఞాన కానన విదాహక మగ్నిహోత్రం
సాయీగురుం శ్రితజనావన కల్పవృక్షమ్ ॥

శ్లో॥ 3. ప్రాతర్భజామి శిరిడీశమనాథ బంధుం
మందస్మితం మధుర భాషణ భూహితాస్యం
ఇచ్ఛానుకూల మఖిలంచ వరందదానం
సాయీగురుం శ్రితజనావన కల్పవృక్షమ్ ॥

**ఫలశ్రుతి : శ్లోక త్రయ మిదం భక్త:**
**సర్వారిష్ట నివారణం**
**ప్రాత: కాలే పఠేన్నిత్యం**
**సర్వత్ర విజయప్రదం ॥**

**శ్రీ సాయి స్మరణం ॥**
**సర్వపాప హరణం ॥**







# ఒక ఉపాధ్యాయిని చెప్పిన జవాబు

**(-'భగవాన్స్ జర్నల్' ఆధారంగా)**

ఒక సమావేశంలో మానవ జీవితంపైన చర్చ జరుగుతోంది. ఒక సి.ఇ.ఓ. ఇలా అన్నాడు - "చాలాసార్లు మనుషులు మరేదీ చెయ్యలేక తనకు ఇష్టం లేకపోయినా తప్పనిసరై టీచర్లవుతారు. అలాంటి వాళ్ల దగ్గర పిల్లలేం నేర్చుకోగలరు?" ఇలా అని ఆగకుండా ఆయన తన ప్రక్కనున్న మరో అతిథితో "ఏం శాంతీ, మీరు టీచరే గదా! నిజాయితీగా చెప్పండి-మీరేం చేస్తున్నారు?" అన్నాడు రవంత హేళనగానూ, మితిమీరిన ఆత్మవిశ్వాసంతోనూ. శాంతి నిజాయితీ కలదే కాదు - స్పష్టంగా ఖచ్చితంగా మాట్లాడటానికి కూడా వెనకాడని మనిషి. ఆమె ఇలా అన్నది -

"నేను ఏం చేస్తుంటానో మీకు నిజంగా తెలుసుకోవాలని ఉన్నదా? ఐతే, వినండి. పిల్లలు తాము చెయ్యలేమనుకొనే ఎన్నో పనులు చేయిస్తాను. తల్లిదండ్రులు తమ పిల్లలను బొమ్మలూ, ఆటలూ లేకుండా ఐదు నిముషాలు కూడా కుదురుగా కూర్చోబెట్టలేరు. నేను మాత్రం 40 నిముషాలు కూర్చోబెట్ట గలను వాళ్లను. ఎలా చేస్తానంటారా? వాళ్లకు ఆశ్చర్యం కలిగే విషయాలు చెప్తాను. వాళ్లు ప్రశ్నలు అడిగేలా చేస్తాను. వాళ్లు పొరపాట్లు చేస్తే క్షమార్పణ అడిగేలా చేస్తాను - అదీ మనసారా. వాళ్లకు ఆత్మాభిమానం నిలుపుకోవటం, ఇతరులను గౌరవించటం కూడా నేర్పుతాను. వాళ్ల చర్యలకు వాళ్లే బాధ్యత వహించగల శక్తి అలవరుస్తాను. వాళ్లకు ఎలా వ్రాయాలో నేర్పి వాళ్ల చేతనే వ్రాయిస్తాను. చదివిస్తాను. వాళ్ల పని అంతటికీ నా దగ్గరున్న పిల్లలు తమకు దైవం ఇచ్చిన బుర్రలు ఉపయోగిస్తారేగానీ మనుషులు తయారుచేసిన కేలిక్యు లేటర్లు కాదు. వాళ్ల తరగతి గది అన్నది వాళ్లు హాయిగా సురక్షితంగా ఉండగల స్థలం అన్న భావనను వాళ్లలో కలిగిస్తాను. చివరిగా - భగవంతుడు వాళ్లకిచ్చిన బహుమతులన్నిటినీ (శరీరావయవాలు, మెదడు) సక్రమంగా ఉపయోగించుకొని, కష్టించి పనిచేస్తే మనసు చెప్పినట్లు నడిస్తే జీవితంలో ఓటమి అన్నదే ఎదురుకాదని అర్థమయ్యేలా చేస్తాను.

ఒకవేళ-ఎవరైనా నన్ను నా వృత్తినిబట్టి అంచనా కట్టబోతే-నేను సగర్వంగా తలెత్తి నిలబడి వాళ్లను లెక్కచెయ్యను. ఎందుకంటే-డబ్బే సర్వస్వం కాదని నాకు తెలుసు గనుకా, ఆ విమర్శించేవాళ్లు తెలియని వారు అనుకుంటాను గనుకా! మరి నేనేం చేస్తానో విన్నారుగా! ఇదో విశిష్ట కార్యం". (టీచరన్నవాడు తాను వెలిగి కరుగుతూ యితరులకు దారి చూపించేవాడు.)

# మానస సుధ

– శుకవాణి

తులసీదాసు పరమభక్తుడు. భోగిగా ఉండి, ఒకే ఒక్క హెచ్చరికతో యోగిగా మారిపోయిన భాగ్యశాలి. ఆయన రచన "రామచరిత మానస్" హిందీ వారందరికీ ప్రామాణిక రామాయణం. మామూలుగా కథ చెప్తూచెప్తూనే మధ్యలో తనదైన ఒక ధార్మిక విషయాన్నో, నైతిక విలువనో తళుక్కుమని పించేలా చెప్పటం ఆయన విధానం. అలాంటి ఒకటి, రెండు విషయాలు:-

బాలకాండలో ప్రతాపభానుని కథ చెప్తున్నాడు తులసీదాసు. రాజుని మోసం చెయ్యటానికై రాక్షసుడు ముని వేషధారియై పరమశాంత స్వరూపంతో కనిపించాడు. మధురమైన జాలిగొలిపే మాటలతో ఈయనొవరో మహనీయు డన్న భావనను కల్పించాడు. "ఇక్కడ ఇంతకాలంగా ఉన్నాను కాని నేను ఎవరినీ కలవలేదు, ఎవరికీ కనబడలేదు అలా లోకమాన్యతను పొందడం తపస్సుకు చెరుపు చేస్తుంది కదా" అన్నాడు రాజు. ఆ మాటలు విని రాజు మోసపోయినాడు. ఈ విషయం చెప్తూ తులసీదాసు "తులసీ దేఖీ సుబేషు, భూలహి మూఢన చతుర నర, సుందర కేకి హి. పేఖు, బచన సుధా సమ అసన అహి" సుందర వేషాన్ని చూసి మూర్ఖులే కాదు. తెలివికలవారు కూడా మోసపోతుంటారు. నెమలికి రూపం సుందరం. భోజనం సర్పాలు కదా - అంటారు.

రావణాది రాక్షసులు ఉదయించారు. వారు చేయని దురంతాలు లేవు అని వివరిస్తూ చాలా చమత్కారంగా ఎటువంటి రాక్షసులు అనవచ్చో చెప్తాడు తులసీదాసు.

"బాడే ఖలబహు చోరజు ఆర, జేలంపట పరధన పరధార
మానహి: మాతు పితానహి: దేవా, సాధున్ హసన కరవాహి సేవా
జిన్హ: కే యహ ఆచరణ భవాని, తేజానహునిసి చర సబప్రాణి"

- ఓ పార్వతీ పరుల సొత్తు అపహరించేవారు, పరస్త్రీలను దొంగిలించే వారు, లౌకిక లంపటాలలో కూరుకుపోయిన వారు, జూదగాళ్లు మొదలైన నీచులు చెలరేగిపోయారు. వీరు తల్లిదండ్రులను, దేవతలను గౌరవించరు, మన్నించరు (గౌరవించరు) సాధు సత్పురుషులను సేవించకపోగా ఎదురు వారిచేతనే సేవలు పొందుతారు. ఇలాంటి దుష్కార్యాలు చేసేవారు ఎవరైనా సరే రాక్షసులే అని గ్రహించు అనిపించారు శివునితో. నేటి ప్రపంచంలో ఈ లెక్కన తొంభై తొమ్మిది శాతం అసురగుణం ఉన్నట్లే.

భరతుడు మేనమామ ఇంటి నుంచి వచ్చి దశరథుని మృతి గురించీ,





శ్రీరామ వనవాసం గురించీ విని, దు:ఖంతో అవమానంతో కృంగిపోయాడు. ఎలాగో దశరథుని అంత్యక్రియలు పూర్తి చేసాడు. అటుపైన భరతుని చెంత కూర్చుండబెట్టుకొని వసిష్ఠుడు జరిగిన విషయమంతా మరోసారి స్మరించాడు. అటుపైన శ్రీరామచంద్రుని సుగుణాలను గురించి ప్రశంసిస్తూ కన్నీట కరిగిపోయాడు. దు:ఖార్తుడైన ఆయన "నాయనా విను. విధి బలవత్తరమైనది. లాభం-నష్టం, చావు-బ్రతుకు, కీర్తి-అపకీర్తి, ఇవన్నీ కూడా విధి చేతుల్లోవే. అందుచేత ఎవరిని దూషించగలము? ఎవరిని కోపించ గలము? అయినా మీ తండ్రి గారిని గూర్చి నీవు విచారించనక్కర లేదు భరతకుమారా! ఆయనకేమి మహానుభావుడు. వేదాలు, వేద విధినీ విడిచిపెట్టి, స్వధర్మాన్ని విడిచి పతనమార్గంలో ఉన్న బ్రాహ్మణుని చూచి విచారించాలి. రాజనీతిని విడచి, ప్రజలు తన బిడ్డలవలె ప్రాణ సమానులని భావించని నరపాలుని దశ దయనీయం. ధనవంతులై కూడా పిసినారి వాడై, అతిథి సేవ - దైవసేవ కూడా మరచిన వైశ్యుడిని చూచి జాలిపడి విచారించాలి. వ్యర్థమైన వాదాలతో విప్రులను అవమానిస్తూ తాను నేర్చిన కాస్త జ్ఞానానికే పొగరెక్కి పతనం అయిన శూద్రుని చూచి విచారించాలి. తాను నేర్చిన వివేకవైరాగ్యాలను మంటగలిపి, లౌకిక వాంఛలలోకి దుమికిన సన్యాసిని గూర్చి బాధపడాలి. తపస్సు విడిచిపెట్టి విషయభోగాలవైపు మొగ్గిన వానప్రస్థుని గూర్చి వాపోవాలి. దైవభక్తుడై కూడా - లేదా అలా కన్పిస్తూ కూడా ఇతరులకు కీడు చేస్తూ తన పొట్ట నింపుకోవటం మాత్రమే నేర్చిన దయారహితుడు, స్వార్థపరుడైన వానిని చూచి దు:ఖించాలి. చాడీలు చెప్తూ, తల్లిదండ్రులకు, గురువుకు, సోదరులకు కూడా విరోధి అయిన మానవుని గూర్చి 'అయ్యో!' అని విచారించాలి. అజ్ఞానంతో కర్మమార్గాన్ని వీడి (అతిథి మర్యాద, గురుజన సేవ వంటి వానిని) సంచరించే గృహస్థుని చూచి మనం బాధపడాలి. మగని మోసం చేసేదీ, కపటస్వభావం గలదీ, గయ్యాళిదీ, తిరుగుబోతుదీ అయిన స్త్రీని కాంచి విచారించాలి. గురువు ఆజ్ఞను ధిక్కరించి, బ్రహ్మచర్య నియమాలు అతిక్రమించిపోయిన బ్రహ్మచారిని చూచి విషణ్ణులం కావాలి. భరతకుమారా, నీ తండ్రి విశ్వవిఖ్యాతుడై, మీ వంటి పుత్రులను కన్న భాగ్యశాలియైన వాడు. ఆయనను గూర్చి ఏడువవలసినదేమీ లేదు. నీ పిత్రాజ్ఞను పాలించటమే నీ విపుడు చేయవలసిన కర్తవ్యం" అన్నాడు వశిష్ఠుడు. మనం పైన చెప్పకొన్న త్రోవతప్పిన వారు సాక్షాత్తు శవప్రాయులేనని వసిష్ఠుల వారి భావం. కీర్తివంతులు మృతులైనా అమరులే. నీతిహీనులు సజీవులైనా మృతప్రాయులే. ఇలాటి అమూల్య బోధలెన్నో తులసీ రామాయణంలో ఉన్నాయి. మరోసారి మరో కొన్ని.